సాక్షి నిజామాబాద్
ఆదివారం । 11 । ఆగస్టు । 2024



ఆనకట్టపై ఆగని ఆగడాలు!
ఎస్సారెస్పీ ఆనకట్టపై కొందరు నిత్యం మందు తాగుతున్నారు. దీంతో పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు.
- 8లో ▸



చోరీ కేసులో అరెస్టు
ఇన్నోవా వాహనాన్ని చోరీ చేసిన ఘటనలో భార్యాభర్తలను అరెస్టు చేసినట్లు ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు.
- 8లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
36.7 /22.5
ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

'నిజామాబాద్ మున్సిపల్'ను ప్రక్షాళన చేయాలి

సుభాష్‌నగర్ : నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారిందని, పూర్తిగా ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. మున్సిపల్ రెవెన్యూ అధికారిపై ఏసీబీ దాడుల నేపథ్యంలో ఆయన శనివారం ఒక ప్రకటనలో స్పందించారు. మున్సిపాలిటీలో భారీగా అవినీతి జరుగుతుందని తాను గెలిచినప్పటి నుంచి పలుమార్లు హెచ్చరించానని గుర్తుచేశారు. అధికారి ఇంట్లో రూ.6కోట్లకుపైగా నగదు, బంగారు ఆభరణాలు, విలువైన ఆస్తుల దస్తావేజులు దొరకడమే ఇందుకు నిదర్శనమన్నారు. మున్సిపాలిటీలోని వివిధ శాఖల్లోనూ అవినీతి తిమింగలాలు ఉన్నాయని, ప్రభుత్వం స్పందించి ప్రక్షాళన చేపట్టాలని డిమాండ్‌చేశారు. ఏసీబీ అధికారులు రికవరీ చేసిన అక్రమ ఆస్తులు తిరిగి మున్సిపల్ ఖాతాలో జమ చేసి అభివృద్ధికి ఖర్చు చేయాలన్నారు.

కొనసాగుతున్న నీటి విడుదల



బాల్కొండ : శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి కాలువల ద్వారా నీటి విడుదల కొనసాగుతోంది. కాకతీయ కాలువ ద్వారా 2500 క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 50 క్యూసెక్కులు, లక్ష్మీకాలువ ద్వారా 50 క్యూసెక్కులు ఆయకట్టుకు వదులుతున్నారు. ఆవిరి రూపంలో 502 క్యూసెక్కులు, మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80 టీఎంసీలు) అడుగులు కాగా శనివారం సాయంత్రానికి 1080.80(47.25 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు.

మహిళల సమానత్వం కోసం పోరాడాలి



నిజామాబాద్ రూరల్ : మహిళల సమానత్వం కోసం పోరాటాలు చేయాలని ప్రగతిశీల మహిళా సంఘం (పీవోడబ్ల్యూ) రాష్ట్ర అధ్యక్షురాలు జి ఝాన్సీ అన్నారు. నిజామాబాద్ నగరంలోని ద్వారకానగర్ ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో శనివారం సంఘం ఏడో మహసభ నిర్వహించారు. ముందుగా సంఘం జెండాను జిల్లా అధ్యక్షురాలు ఆకుల అరుణ ఆవిష్కరించారు. అనంతరం ఝాన్సీ మాట్లాడుతూ.. మహిళల పోరాటాల ఫలితంగా ప్రభుత్వాలు అనేక చట్టాలు తీసుకొచ్చాయని గుర్తు చేశారు. కానీ నేడు ప్రభుత్వాలు మహిళా చట్టాలను సక్రమంగా అమలు చేయడం లేదన్నారు. హక్కుల కోసం మహిళలు నిరంతరం పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. మహిళలపై అత్యాచారాలు, హత్యలు, దాడులను అరికట్టాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య, పీవోడబ్ల్యూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పిట్ల సరిత, నీలం లక్ష్మి, సంజన పద్మ, చిట్టక్క, అనంతక్క, భారతి, రాధ, అనురాధ, శైలజ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగాన్ని బలోపేతం చేయాలి



నిజామాబాద్ అర్బన్ : ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేయాలని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్)జిల్లా ప్రధాన కార్యదర్శి రమేశ్, అధ్యక్షుడు సత్యానంద్ డిమాండ్ చేశారు. నగరంలోని కార్యాలయంలో శనివారం యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి యూటీఎఫ్ ఎన్నో పోరాటాలు చేసిందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎం మల్లేశ్, గంగాధర్, రాజారాం, సాయన్న, భాజన్న, భూమేశ్వర్, సోన్‌పేట్ గంగాధర్, శంకర్, కపిల్‌దేవ్, రవీందర్, లక్ష్మి, శైలజ తదితరులు పాల్గొన్నారు.



పూజలందుకుంటున్న వేంకటేశ్వర స్వామి



ఆర్మూర్‌లోని జెండా బాలాజీ మందిరం →





ఆలయంలో ప్రతిష్ఠించిన జెండా వద్ద భక్తులు

జెండాకు జై!

■ ఈనెల 15న ఆర్మూర్‌లో జెండా జాతర ■ 200 ఏళ్లుగా కొనసాగుతున్న ఆనవాయితీ
■ దసరా నాటికి తిరుమలకు చేరనున్న శోభాయాత్ర ■ తరలిరానున్న భక్తులు

ఆర్మూర్: ఆర్మూర్‌లో నిర్వహించే జెండా జాతరకు 200 ఏళ్ల చరిత్ర ఉంది. తిరుపతి వెంకన్నను దర్శించు కోలేని వారు ఈ జెండాను దర్శనం చేసుకుంటే కోరికలు తీరుతాయని నమ్ముతారు. ఆర్మూర్‌లోని వేంకటేశ్వర ఆలయంలో గల జెండా మందిరంలో ఈ నెల 15న గురువారం ఏకాదశిని పురస్కరించుకొని జెండా జాతరను నిర్వహించనున్నారు. తిరుపతికి వెళ్లలేని భక్తుల కోసం అంకాపూర్ దొరలు ఈ జెండా పండుగను ప్రారంభించినట్లు ప్రతీతి. 200 సంవత్సరాలకు పైగా పురాతన చరిత్ర గల జెండా జాతరకు ఆర్మూర్ పరిసర ప్రాంతాల్లోని భక్తులు పెద్ద సంఖ్యలో వస్తారు. ఆర్మూర్ మండలం అంకాపూర్ కేంద్రంగా పాలన సాగించిన దొర గడ్డం వెంకట భూమారెడ్డి ఆధ్వర్యంలో జెండా పండుగను ప్రారంభించినట్లు ప్రతీతి. అనాదిగా వస్తున్న సాంప్రదాయాన్ని ప్రస్తుతం ఆయన కుటుంబ సభ్యులతో పాటు ఆర్మూర్ సర్వసమాజ్ సభ్యులు కొనసాగిస్తున్నారు.

సండే స్పెషల్

నిజాం కాలంలో ఆక్షేపణలను అధిగమించి..

నిజాం నవాబుల కాలంలో జెండా పండుగ నిర్వహణకు ఎన్నో అడ్డంకులు కల్పించే వారని పెద్దలు చెబుతుంటారు. జాతర జరపాలంటే జెండా కర్రకు ఆకుపచ్చని రంగు వేయించేవారని, జెండాకు కట్టే పట్టు గుడ్డపై అర్ధ చంద్రాకారంలో నక్షత్రం గుర్తు ఉండాలని నిజాం ప్రభువులు ఆదేశించారని చెబుతారు. ప్రతికూల పరిస్థితుల్లో సైతం ఈ ప్రాంత ప్రజలు హిందూ సాంప్రదాయాన్ని కొనసాగించారు. అయితే పద్నాలుగేళ్ల క్రితం జెండా కర్ర విరిగిపోవడంతో రాజమండ్రి నుంచి వెదురు బొంగు తెప్పించారు. అనేక సంవత్సరాలుగా కొనసాగుతున్న జెండాపై చంద్రుని మధ్యలో ఉండే నక్షత్రాన్ని సర్వసమాజ్, ఆలయ కమిటీ సభ్యులు తొలగించారు. ఆ స్థలంలో ఓం గుర్తును ఏర్పాటు చేశారు. నాటి నుంచి మారిన ఆచారం కొనసాగుతూనే ఉంది. జాతరకు తొమ్మిది రోజుల ముందు పట్టు వస్త్రాన్ని జెండాపై ఉంచి దానిపై ఓం గుర్తును పెడతారు. శ్రావణ శుద్ధ తదియ రోజున జెండాను ప్రతిష్ఠించిన అనంతరం తొమ్మిది రోజుల పాటు పూజలు నిర్వహిస్తారు.

ఆర్మూర్ నుంచి తిరుమల వరకు..

తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం సర్వసమాజ్, ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా జెండా జాతరను నిర్వహిస్తారు. ఉదయాన్నే భక్తుల ప్రత్యేక పూజలతో ప్రారంభమయ్యే జాతర సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుంది. తర్వాత జెండాను ఊరేగింపుగా జెండా మందిరం నుంచి ఆర్మూర్ పట్టణంలోని కాశీ హనుమాన్ వీధి, ఆలూర్ గైని, ధోబీఘాట్ మీదుగా ఆర్మూర్ మండలంలోని అంకాపూర్ శివారు వరకు తీసుకెళ్లి అంకాపూర్ గ్రామస్తులకు అప్పగిస్తారు. అంకాపూర్‌లో 22 రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. వినాయక చవితి తెల్లవారి అక్కడి నుంచి అంకాపూర్ గ్రామస్తులు ఊరేగింపుగా జెండాను జక్రాన్‌పల్లి మండలం అర్గుల్ వరకు తీసుకెళ్తారు. ఈ జెండాను గతంలో ముడుపులు కట్టి గ్రామ గ్రామానికి ఊరేగిస్తూ కాలి నడకన తిరుపతిలోని వేంకటేశ్వర స్వామి ఆలయానికి చేర్చేవారు. ప్రస్తుతం ప్రత్యేక వాహనంలో జెండాను తరలిస్తున్నారు.

జెండా జాతరలో భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహిస్తే తమ మొక్కులు తీరుతాయని భక్తుల నమ్మకం. దీంతో పట్టణానికి చెందిన భక్తులతో పాటు ఇతర రాష్ట్రాలు, చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి జాతర రోజున జెండా దర్శనం చేసుకుంటారు.

ఏర్పాట్లు పూర్తి

జెండా జాతరను ఘనంగా నిర్వహించడానికి ఆలయ కమిటీతో పాటు సర్వసమాజ్ వారు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ నెల 7న ప్రత్యేక పూజల అనంతరం జెండాను ప్రతిష్ఠించారు. ఈ నెల 15న జాతరను పురస్కరించుకొని పెద్ద సంఖ్యలో చిరు వ్యాపారులు ఆర్మూర్ పట్టణానికి చేరుకొని ఆలయ పరిసరాల్లో తాత్కాలిక దుకాణాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నారు.

సంప్రదాయాలను రక్షించడమే లక్ష్యం



హిందూ సంప్రదాయాలను పరిరక్షించడమే లక్ష్యంగా 1973 నుంచి ఈ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్నా. ఆచారం ప్రకారం ముడుపులు కట్టి జెండాను తిరుమల వరకు చేర్చడం పూర్వజన్మలో చేసుకున్న సుకృతంగా భావించి భక్తిశ్రద్ధలతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం.

–జెండా సగ్వయ్ మధుకర్ శర్మ,
పూజారి, జెండా బాలాజీ మందిరం

హిందువుల్లో ఐక్యత కోసం కృషి చేస్తున్నాం



మాట్లాడుతున్న వీహెచ్‌పీ కేంద్రీయ సంయుక్త ప్రధాన కార్యదర్శి కోటేశ్వర శర్మ

- వీహెచ్‌పీ కేంద్రీయ సంయుక్త ప్రధాన కార్యదర్శి కోటేశ్వర శర్మ
- కామారెడ్డిలో రాష్ట్ర సమావేశాలు ప్రారంభం

కామారెడ్డి అర్బన్: హిందువుల్లో ఐక్యత కోసం కృషి చేస్తున్నామని వీహెచ్‌పీ కేంద్రీయ సంయుక్త ప్రధాన కార్యదర్శి కోటేశ్వర శర్మ పేర్కొన్నారు. శనివారం కామారెడ్డిలోని శ్రీసరస్వతి విద్యా మందిర్ హైస్కూల్‌లో వీహెచ్‌పీ తెలంగాణ ప్రాంత వర్షాకాల రెండు రోజుల సమావేశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కోటేశ్వరశర్మ మాట్లాడుతూ విశ్వహిందూ పరిషత్‌ను సంస్థాగతంగా మరింత పటిష్టం చేస్తున్నామన్నారు. హిందుత్వ విలువలు రక్షించడం, బలోపేతం చేయడం, ఐక్యత, విద్య ఆరోగ్యాభివృద్ధి, సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించడం కోసం వివిధ విభాగాల ద్వారా కృషి చేస్తున్నామన్నారు. గ్రామ స్థాయి వరకు వీహెచ్‌పీ శాఖలను విస్తరించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని తెలంగాణ ప్రాంత అధ్యక్షుడు నరసింహమూర్తి తెలిపారు.

నేడు ఆత్మీయ సమ్మేళనం

వీహెచ్‌పీ స్థాపన దినోత్సవం సందర్భంగా ఆదివారం సాయంత్రం 5 గంటలకు శ్రీసరస్వతి విద్యా మందిర్ హైస్కూల్‌లో హిందూ కుటుంబాల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు పరిషత్ నగర అధ్యక్షుడు వి.వెంకటస్వామి తెలిపారు. వీహెచ్‌పీ భాగ్యనగర్ క్షేత్ర సంఘటన మంత్రి గుమ్మళ్ల సత్యం ప్రధాన వక్తగా పాల్గొనే సమ్మేళనంలో హిందువులు కుటుంబ సమేతంగా పాల్గొనాలని కోరారు. రాష్ట్ర సమావేశాలలో భాగ్యనగర్ క్షేత్ర సంఘటన మంత్రి గుమ్మళ్ల సత్యం, తెలంగాణ ప్రాంత కార్యదర్శి లక్ష్మీనారాయణ, సహమంత్రి రాజేశ్వరరెడ్డి, విభాగ కార్యదర్శి తమ్మల కృష్ణ, జిల్లా అధ్యక్షుడు గోపాలకృష్ణ, కార్యదర్శి బొల్లి రాజు, నగర అధ్యక్షుడు వడ్ల వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఏళ్లుగా కదలకుండా.. అవినీతిలో అనకొండ!

- కార్పొరేషన్ రెవెన్యూ ఆఫీసర్ నరేందర్‌పై కొనసాగుతున్న విచారణ
- 14 రోజుల రిమాండ్ విధించిన నాంపల్లి కోర్టు



పట్టుబడిన నగదు, నగలతో నరేందర్(ఫైల్)

ఖలీల్‌వాడి : నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ రెవెన్యూ ఇన్‌చార్జి ఆఫీసర్ నరేందర్ ఏళ్లుగా ఇక్కడే తిష్ట వేసి, అవినీతిలో ఆరితేరారు. 1996లో నరేందర్ నిజామాబాద్ మున్సిపల్‌లో బిల్ కలెక్టర్ నుంచి వివిధ హోదాల్లో పని చేశారు. ప్రస్తుతం రెవెన్యూ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆయనకు పలుమార్లు బదిలీ అయినా ఆయన స్థానంలోకి ఎవరూ రాకపోవడంతో బదిలీ ఆగిపోయింది. ఎన్నికలకు ముందు నరేందర్‌ను బోధన్‌కు బదిలీ చేశారు. బోధన్ నుంచి రావాల్సిన మున్సిపల్ ఉద్యోగి ఇక్కడికి రాకపోవడంతో అప్పుడు కూడా నిలిచిపోయింది. ఏళ్లుగా ఇక్కడే విధులు నిర్వహిస్తున్న నరేందర్‌పై ఏసీబీ అధికారులకు ఆరు ఏళ్లుగా ఫిర్యాదులు వెళ్తున్నాయి. పూర్తిస్థాయి ఆధారాలు లేకపోవడంతో ఏసీబీ అధికారులు దాడులు చేయలేదని సమాచారం. ఇటీవల ఏసీబీ డీజీగా సీవీ ఆనంద్ బాధ్యతలు తీసుకున్న తర్వాత రాష్ట్రంలో లాంగ్ స్టాండింగ్‌లో ఉన్న అధికారులపై ఏసీబీ అధికారులు దృష్టి పెట్టారు. అందులో భాగంగా నిజామాబాద్ కార్పొరేషన్ రెవెన్యూ అధికారి నరేందర్ తోపాటు మున్సిపల్ కార్పొరేషన్‌లోని పలువురి అవినీతి అధికారుల వివరాలను సేకరించినట్లు సమాచారం. నెల రోజులుగా నరేందర్‌పై ఏసీబీ దాడులు చేయడానికి కసరత్తు చేసినట్లు సమాచారం. కార్పొరేషన్‌లో నరేందర్‌ను గురువారం రాత్రి 10 గంటల ప్రాంతంలోనే అదుపులోకి తీసుకొని తనిఖీలు చేయాల్సి ఉండేది. కానీ కార్పొరేషన్‌లో ఏసీబీ దాడులకు అనుకూలంగా లేకపోవడంతో శుక్రవారం ఉదయం 5:30 గంటలకు సోదాలు నిర్వహించారు. ఈ సోదాలలో రూ.6.7 కోట్ల విలువైన ఆస్తులు లభించిన విషయం తెలిసిందే.

చంచల్‌గూడ జైలుకు నరేందర్

రెవెన్యూ ఆఫీసర్ నరేందర్‌ను నాంపల్లి కోర్టులో హాజరుపర్చగా కోర్టు 14 రోజుల పాటు రిమాండ్ విధించింది. దీంతో ఆయనను చంచల్‌గూడ జైలుకు తరలించారు. జిల్లా కేంద్రంలోని నరేందర్ ఇల్లు ఏసీబీ అధికారుల అదుపులోనే ఉంది. నరేందర్‌కు వచ్చే ఆదాయం, ఆయన భార్య ప్రభుత్వ టీచర్ కావడంతో వారికి వచ్చే ఆదాయంపై వివరాలు సేకరిస్తున్నారు. ఏసీబీ సోదాల్లో 17 డాక్యుమెంట్లు లభించాయి. ఆదాయానికి మించిన ఆస్తులు ఉంటే వాటిని కోర్టు అనుమతితో అటాచ్ చేస్తారని తెలిసింది.

రూ.2.93 కోట్ల నగదుపై ఆరా

నగరంలోని అశోక్ టవర్స్‌లో కార్పొరేషన్ రెవెన్యూ అధికారి నరేందర్ ఇంట్లో శుక్రవారం దాడుల్లో లభించిన రూ. 2.93 కోట్ల నగదుపై అధికారులు విచారణ చేశారు. రూ.75 లక్షలు ప్లాట్ అమ్మితే వచ్చినవని, మరి కొంత నగదు బ్యాంక్ లోన్ తీసుకున్నాని, మిగితా డబ్బు కోడలుకు మెడికల్ సీట్ కోసం జమ చేశానని నరేందర్ చెప్పినట్లు సమాచారం. ఈ నగదుపై ఏసీబీ అధికారులు ఆరా తీస్తున్నారు. నరేందర్ ఇంటితోపాటు నరేందర్ తల్లి ఇల్లు, ఆర్మూర్, నిర్మల్‌లో ఏకకాలంలో తనిఖీలు చేశారు.

బ్యాంకర్లకు నోటీసులు

కార్పొరేషన్ రెవెన్యూ ఆఫీసర్ నరేందర్ కుటుంబ సభ్యుల బ్యాంక్ ఖాతాల్లో రూ.1.30 కోట్లు ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. వారి బ్యాంక్ లాకర్లను సీజ్ చేసి ఉంచాలని బ్యాంకర్లకు ఏసీబీ అధికారులు నోటీసులు అందజేసినట్లు సమాచారం. రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఇప్పటి వరకు ఏసీబీ దాడుల్లో అత్యధికంగా రూ.2.10 కోట్ల నగదు లభించింది. కానీ శుక్రవారం నరేందర్ ఇంట్లో రూ.2.93 కోట్ల నగదు లభించడం రాష్ట్ర చరిత్రలో అత్యధికం.

ఆరోగ్య మేళాను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా వైద్యాధికారి రాజశ్రీ



డిచ్‌పల్లి సీహెచ్‌సీలో ఆరోగ్యమేళాను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో రాజశ్రీ

డిచ్‌పల్లి : డిచ్‌పల్లిలోని సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)లో ప్రతి నెల రెండో శనివారం నిర్వహిస్తున్న ఆరోగ్య మేళాను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్‌వో) రాజశ్రీ కోరారు. శనివారం డిచ్‌పల్లి సీహెచ్‌సీని ఆమె సందర్శించి ఆరోగ్యమేళాను పరిశీలించారు. ఆయుష్మాన్ భారత్ కార్యక్రమం కింద ప్రత్యేక వైద్య నిపుణులతో ఆరోగ్యమేళాలో రోగులకు వివిధ వైద్య సేవలందిస్తున్నట్లు ఆమె తెలిపారు. స్త్రీ వైద్య నిపుణురాలు సుష్మ, దంత వైద్య నిపుణురాలు సరితగ్రేస్ ఆరోగ్య మేళాకు వచ్చిన రోగులను పరీక్షించి అవసరమైన వారికి చికిత్స అందించారు. ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు నాణ్యమైన వైద్య సేవలందించాలని వైద్యులు, సిబ్బందికి ఆమె సూచించారు. ఆస్పత్రిలో ఇన్‌పేషంట్, అవుట్ పేషంట్ రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది నాగరాజ్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

నిజామాబాద్ రూరల్ : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో రాజశ్రీ అధికారులను ఆదేశించారు. శనివారం రూరల్ మండలంలోని తిరుమన్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. సిబ్బంది సమయపాలన పాటించాలని ఆదేశించారు. విధుల్లో ఉన్న ఎంఎల్‌హెచ్‌పీ అఖిల్‌కు అంటువ్యాధుల నియంత్రణ, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు, తదితర అంశాలపై సూచనలు ఇచ్చారు. పీహెచ్‌సీ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. స్వచ్ఛదనం పచ్చదనంలో భాగంగా ఆరోగ్య కేంద్రం పరిధిలో మొక్కలు నాటాలన్నారు. ఏవో చందర్, హెచ్‌ఈవో నాగరాజు, సూపర్‌వైజర్ మధుకర్ పాల్గొన్నారు.

ఇంటింటా ఫీవర్ సర్వే

- సీజనల్ వ్యాధుల నియంత్రణకు అధికారుల చర్యలు



మోర్తాడ్‌లో సర్వే నిర్వహిస్తున్న సిబ్బంది

మోర్తాడ్ : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండటం, ప్రజల ఆరోగ్యాన్ని రక్షించడానికి వైద్య ఆరోగ్య శాఖ ఇంటింటి సర్వే చేపడుతోంది. ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్‌లు, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు సర్వేలో పాల్గొంటున్నారు. నీరు నిల్వ ఉంచుకోకుండా అవగాహన కల్పిస్తునే జ్వర సర్వే చేపడుతున్నారు. ప్రజలకు ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నారు. మండల పరిషత్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు ఈ సర్వేను పర్యవేక్షిస్తున్నారు. సెలవు రోజులు అంటూ ఏమి లేకుండానే సర్వేలో సిబ్బంది పాల్గొంటుండటం విశేషం. ఎవరైన జ్వరంతో బాధపడుతుంటే ఆస్పత్రులకు రిఫర్ చేస్తున్నారు.

క్లుప్తంగా

ఓపెన్ స్టడీ సెంటర్ నిర్వహణకు అనుమతి

డిచ్‌పల్లి: మండలంలోని కమలాపూర్ జెడ్పీ హైస్కూల్‌లో ఓపెన్ ఎస్సెస్సీ, ఇంటర్ స్టడీ సెంటర్ నిర్వహణకు ప్రభుత్వం అనుమతి ఇచ్చినట్లు హెచ్‌ఎం, సెంటర్ కో–ఆర్డినేటర్ అమర్‌సింగ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పదో తరగతి లోపు చదువు మానేసిన వారు, ఇంటర్ మధ్యలో ఆపేసిన వారికి, చదువుకోవాలనే ఆసక్తి ఉన్న వయోజనులందరూ ఈ స్టడీ సెంటర్‌లో చదువుకునే అవకాశం ఉంటుందన్నారు. ఆసక్తి, అర్హత గల వారు 8686140150, 9490055313 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌అర్బన్: ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో మిగిలిపోయిన సీట్లకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ నరేశ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మెకానికల్ ఇంజినీరింగ్‌లో 14 సీట్లకు, ఎంబెడెడ్ సిస్టమ్1 సీట్‌కు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఈనెల 12న కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని అదే రోజు కౌన్సెలింగ్ ఉంటుందాన్నరు. విద్యార్థులు తమ ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరు కావాలన్నారు.

కాసర్ల నరేశ్‌రావుకు సినారె పురస్కారం ప్రదానం



మోపాల్(నిజామాబాద్‌రూరల్): మహాకవి సి.నారాయణ రెడ్డి(సినారె) కళాపీఠం ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర భాషా సంస్కృతిక శాఖ సౌజన్యంతో సాహితీవేత్తలకు అందించే సినారె సాహితీ పురస్కారాన్ని మండలంలోని సిర్పూర్ జెడ్పీహెచ్‌ఎస్ తెలుగు ఉపాధ్యాయుడు కాసర్ల నరేశ్‌రావుకు ప్రదానం చేశారు. ఈమేరకు శనివారం హైదరాబాద్‌లో సినారె జయంతి వేడుకలు నిర్వహించారు. ప్రసిద్ధ కవి నందినీ సిద్ధారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సభలో తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జె.చిన్నారెడ్డి చేతుల మీదుగా కాసర్ల నరేషరావు ఈ పురస్కారం అందుకున్నారు. సభలో ప్రముఖ కవు లు నాళేశ్వరం శంకరం, గంటా జలంధర్, కందు కూరి శ్రీరాములు, రఘువీర్ ప్రతాప్, టి. గౌరీశంకర్ పాల్గొన్నారు.

ఇందూరు తిరుమల ఆలయానికి గోదానం



మోపాల్(నిజామాబాద్‌రూరల్): నర్సింగ్‌పల్లి లోగల ఇందూరు తిరుమల వేంకటేశ్వర స్వామి గోవింద వనమాల క్షేత్రంలో ఉన్న గోశాలకు ప్రముఖ సినీ గేయ రచయిత రామజోగయ్య శాస్త్రి శనివారం ఆవులను దానం చేసినట్లు ఆలయ ప్రధాన ధర్మకర్త నర్సింహారెడ్డి తెలిపారు. అదేవిధంగా ఆలయం కేంద్రంలో చేస్తున్న ఆధ్యాత్మిక ప్రకృతి సేద్యాన్ని సందర్శించేందుకు త్వరలోనే వారు ఇందూరు తిరుమలకు వస్తున్నట్లు పేర్కొన్నారు.

పాఠశాలలో షార్ట్ సర్క్యూట్

పెద్దకొడప్‌గల్(జుక్కల్) : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో శనివారం మధ్యాహ్నం విద్యుత్ మెయిన్ బోర్డులో షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగాయి. రెండ శనివారం కావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకోని విద్యార్థులతో కలిసి భోజనం చేసే సమయంలో ఒక్కసారిగా మీటర్ బోర్డులో మంటలు రాగా అంతా భయభ్రాంతులకు గురయ్యారు. ఇన్‌చార్జి ప్రిన్సిపల్ సునీత వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారం అందించి సమస్యను పరిష్కరించారు.

యంత్రలక్ష్మికి నిధులొచ్చేనా?

- వ్యవసాయ యాంత్రీకరణ అమలులో సర్కారు నిర్లక్ష్యం
- రైతుబంధుతోనే సరిపెట్టిన గత ప్రభుత్వం
- సబ్సిడీ పరికరాల పంపిణీపై దృష్టి సారించాలని కోరుతున్న రైతులు



మోర్తాడ్: పంటల సాగులో ఖర్చుల తగ్గింపుతో పాటు పనులు వేగంగా చేసేందుకు యంత్రాలను వినియోగించాల్సి ఉంది. ప్రభుత్వం యంత్రలక్ష్మి పథకానికి నిధులను కేటాయించకపోవడంతో ఈ పథకం స్వస్తి పలికినట్లేనా అనే సందేహం వ్యక్తమవుతోంది. 2018 వర్షాకాల సీజన్ నుంచి రైతుబంధును గత ప్రభుత్వం అమలు చేసింది. పెట్టుబడి సాయం అందిస్తున్నామనే ఉద్దేశ్యంతో యంత్రాల కొనుగోలుకు సబ్సిడీకి నిధులను కేటాయించడం నిలిపివేశారు. ఫలితంగా రైతులు యాంత్రీకరణ వైపు మొగ్గుచూపాలంటే భారీ మొత్తంలో ఖర్చు చేయాల్సి వస్తోంది. వ్యవసాయ యాంత్రీకరణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండు రాయితీ నిధులను మంజూరు చేసేవి. రైతులకు ప్లవ్‌లు, నాగళ్లు, కేజ్‌వీల్స్, రోటవేటర్‌లు, గొర్రు, పాలథీన్ కవర్లు, పసుపు ఉడికించే యంత్రాలు, మక్కలు ఒలిచే యంత్రాలను 30 నుంచి 50 శాతం రాయితీపై అందించేవారు.

గత ప్రభుత్వం ఏర్పడిన తొలినాళ్లలో యంత్రలక్ష్మి పథకాన్ని ప్రత్యేకంగా అమలులోకి తీసుకొచ్చి భారీ సబ్సిడీపై ట్రాక్టర్లను రైతులకు అందించారు. ఓ దశలో జిల్లా వ్యాప్తంగా 200 ట్రాక్టర్లను ఒకేసారి రైతులకు అందించారు. ట్రాక్టర్ల కొనుగోలు భారం తప్పడంతో రైతులకు దుక్కి దున్నడానికి అనువైన మార్గం లభించింది. ప్రత్యేకించి జిల్లాలో వాణిజ్య పంటల సాగు ఎక్కువగా ఉండటంతో యాంత్రీకరణకు బడ్జెట్ కేటాయింపులో ప్రాధాన్యం దక్కేది. ప్రతి ఏటా రూ.25 కోట్ల నుంచి రూ.50 కోట్ల వరకు రాయితీ పథకాలకు నిధులు మంజూరయ్యేవి. 2018లో యాంత్రీకరణ పథకం అమలును నిలపివేయడంతో రైతులు రాయితీకి నోచుకోక ఆర్థిక భారం మోస్తున్నారు. గడచిన నెలలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో యాంత్రీకరణకు నిధులు కేటాయిస్తున్నట్లు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. కానీ వాటి అమలు కోసం మార్గదర్శకాలు జారీ చేయకపోవడంతో పథకం అమలుపై స్పష్టత లోపించింది. ప్రభుత్వం స్పందించి యాంత్రీకరణ కోసం ప్రోత్సాహకాలను పునరుద్ధరించాలని పలువురు కోరుతున్నారు.

కేంద్రం నిధులు ఇచ్చినా..



యంత్రాల కొనుగోలుకు రాయితీ కోసం కేంద్రం నిధులు ఇచ్చినా గత ప్రభుత్వం పక్కదారి పట్టించింది. కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో మాదిరిగా కాకుండా కేంద్రం నిధుల ను రాయితీ కోసం వినియోగించాలి. బడ్జెట్‌లో నిధుల కేటాయింపు ప్రకటనకే పరిమితం కాకుండా చూడాలి. – గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, రైతు, దొన్కల్

సన్నకారు రైతులను ప్రోత్సహించాలి



వ్యవసాయ యాంత్రీకరణలో చిన్న, సన్నకారు రైతులను ప్రోత్సహించాలి. 2018కి ముందు అమలు చేసిన రాయితీ పథకాలను పునరుద్ధరించాలి. ఎంతో మంది రైతులు యంత్రాలను కొనుగోలు చేయలేక అవస్థలు పడుతున్నారు. – మాదాం ప్రణీత్, రైతు, తొర్తి

పోలీసుల శ్రమదానం



రోడ్డుపై గుంతలను పూడుస్తున్న పోలీసులు

ఎల్లారెడ్డి : కొన్ని రోజులుగా రహదారిపై ఉన్న గుంతల కారణంగా ప్రమాదాలు జరుగుతుండడంతో పోలీసులే స్వచ్ఛందంగా ముందుకొచ్చి శ్రమదానం చేసి గుంతలను పూడ్చారు. వివరాల్లోకి వెళ్తే.. ఎల్లారెడ్డి–బాన్సువాడ రహదారిపై పోలీస్‌స్టేషన్ పరిధిలోని తిమ్మారెడ్డి గ్రామ శివారులోని రామలింగం బావి వద్ద రోడ్డుపై ఏర్పడిన పెద్దపెద్ద గుంతలు ఆ దారిలో వెళ్లే వాహనదారులకు ప్రాణాంతకంగా మారాయి. ప్రధాన రహదారిపై ఆ గుంతల పక్కనే ఉన్న కల్వర్టు కూడా సైడ్ వాల్స్ కూలిపోయి శిథిలావస్థకు చేరుకుని ప్రమాదకరంగా మారింది. ఈ రోడ్డుపై గుంతలు, కల్వర్టు రిపేర్లు రోడ్డు మెయింటెనెన్స్ కాంట్రాక్టర్లతో జరిపిస్తామని ఆర్‌అండ్‌బీ అధికారులు అంటూనే కాలం గడుపుతున్నారు. తరుచూ ప్రమాదాలు జరుగుతుండటంతో పెట్రోకార్ సిబ్బంది, బ్లూ కోల్ట్ కానిస్టేబుళ్లు శనివారం మొరంతో రోడ్డుపై గుంతలను శ్రమదానం చేసి పూడ్చి వేశారు. ఎల్లారెడ్డి ఏఎస్సై విజయ, హెడ్ కానిస్టేబుల్ మధుసూదన్ రెడ్డి, కానిస్టేబుల్ ఆంజనేయులు, బ్లూ కోల్ట్ కానిస్టేబుళ్లు ఇద్రిస్, బాబయ్యను పలువురు ప్రశంసించారు.

పురివిప్పిన నాట్యమయూరం



బీబీపేట : నెమలి నాట్యం చేస్తూ పురివిప్పితే ఆ సోయగం ఎంతటి వారినైనా కట్టిపడేస్తుంది. దాన్ని చూశాక ప్రకృతిలో అంతకన్నా అందమేదీ లేదనిపిస్తుంది. శనివారం బీబీపేట శివారులో సూర్యుడు ఉదయిస్తున్న సమయంలో 'సాక్షి' కెమెరాకు చిక్కింది. సహజంగా వర్షాకాలం సీజన్‌లోనే మగనెమలి పురివిప్పి నాట్యం చేస్తుంది.

ఇన్నోవా చోరీ కేసులో దంపతుల అరెస్ట్

- పలు నేరాలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడి
- రిమాండ్‌కు తరలింపు
- వివరాలు తెలిపిన డీఎస్పీ శ్రీనివాసులు



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసులు,



నిందితులు చోరీ చేసిన ఇన్నోవా కారు

లింగంపేట: ఇన్నోవా చోరీ కేసులో దంపతులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు పేర్కొన్నారు. చోరీ వివరాలను లింగంపేట పీఎస్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. మండలంలోని కన్నాపూర్ గ్రామానికి చెందిన దారపోయిన శ్రీకాంత్ అతని భార్య అనిత హైదరాబాద్‌లోని బాల్‌నగర్‌లోని చింతల్‌లో నివాసం ఉంటున్నారు. రోజువారి కూలీ చేసుకుంటూ గుట్టు చప్పుడు కాకుండా నేరాలకు పాల్పడుతున్నారు. శ్రీకాంత్‌పై గతంలో మహేశ్వరం, సైఫాబాద్, రామాయంపేట, సదాశివనగర్, లింగంపేట, ఘట్‌కేసర్, అల్లాపూర్ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. అల్లాపూర్ పీఎస్ పరిధిలో గత ఏడాది ఒకరిని హత్య చేసి జైలుకు వెళ్లాడు. సంవత్సరం పాటు సంగారెడ్డి జైలులో శిక్ష అనుభవించాడు. శ్రీకాంత్ జైలులో ఉన్న సమయంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన స్టీవెన్ చోరీ కేసులో సంగారెడ్డి జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు. జైలులో వీరిద్దరికి పరిచయం ఏర్పడింది. జైలు పరిచయం బయటకు వచ్చిన తర్వాత కొనసాగింది. స్టీవెన్ ముందుగా, నెల రోజుల క్రితం శ్రీకాంత్ జైలు నుంచి బయటకు వచ్చారు. చింతల్‌లో ఉంటున్న శ్రీకాంత్ దంపతులకు అదే బస్తీలోనే ఉంటున్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన గూడవల్లీ స్టీవెన్ తరచూ కలుస్తూ ఉండేవారు. స్టీవెన్ ఇన్నోవా వాహనం లీజుకు తీసుకొని కిరాయిల మీద జీవనం కొనసాగిస్తున్నాడు. శ్రీకాంత్ దంపతులు పథకం ప్రకారం స్టీవెన్ ఇన్నోవాను చోరీ చేసి అమ్మి డబ్బులు చేసుకోవాలని చూశారు. ఈ క్రమంలో గురువారం స్టీవెన్ ఇన్నోవాను కిరాయికి మాట్లాడుకొని హైదరాబాద్ నుంచి లింగంపేట మండలం కన్నాపూర్ స్వగ్రామానికి రాత్రి 9 గంటలకు బయలుదేరారు.

నిందితులు వేసుకున్న పథకం ప్రకారం కన్నాపూర్ శివారులోకి రాగానే అటవీ ప్రాంతంలో కాలకృత్యాల కోసం వాహనం నిలిపివేయించారు. ముగ్గురు వాహనం దిగారు. స్టీవెన్ మూత్రంకు వెళ్లగా వెనుకనుంచి తలపై కొట్టారు. వెంటనే శ్రీకాంత్ భార్య చున్నీతో మెడకు బిగించారు. స్టీవెన్ స్పృహ కోల్పోయి కిందపడిపోయాడు. దీంతో అతడు చనిపోయాడని గమనించి అతని వద్ద ఉన్న పర్సు, ఐడీ కార్డులు, రెండు సెల్‌ఫోన్లు తీసుకొని ఇన్నోవా వాహనంతో పరారయ్యారు. స్పృహ కోల్పోయిన స్టీవెన్ కొద్దిసేపటి తర్వాత తేరుకొని కన్నాపూర్ రోడ్డు పక్కనే ఉన్న సబ్ స్టేషన్‌కు వెళ్లి ఆపరేటర్ ఫోన్ ద్వారా డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం ఇచ్చాడు. దీంతో పోలీసులు రంగంలోకి దిగి గాలింపు చర్యలు చేపట్టారు. నిందితులు నల్లమడుగు శివారులో కారులో డీజిల్ అయిపోవడంతో రోడ్డు పక్కన నిలిపారు. వారి వద్ద డబ్బులు లేకపోవడంతో కన్నాపూర్‌కు వెళ్లి డబ్బులు తీసుకురావడానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో పోలీసులకు నిందితులు గ్రామ సమీపంలో దొరికారు. వారిని పట్టుకొని విచారణ చేశారు. విచారణలో వారు గతంలో చేసిన నేరాలను ఒప్పుకున్నారు. దీంతో శ్రీకాంత్, అనితను రిమాండ్‌కు తరలించారు.

కేసును చేదించిన సీఐ రవీందర్, లింగంపేట ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి, టెక్నికల్ హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్, సిబ్బందిని ఎస్పీ సిందూశర్మ అభినందించారు.

పోటీని తట్టుకుంటూ వ్యాపారం చేయాలి

- నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సూర్యనారాయణ గుప్తా

కామారెడ్డి అర్బన్: ఫ్యాషన్ ప్రపంచంలో వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా, మార్కెట్ పోటీని తట్టుకుంటూ వ్యాపారం చేయాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. కామారెడ్డి క్లాథ్ మర్చెంట్ అసోసియేషన్(బట్టల వర్తక సంఘం) నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమం శనివారం నిర్వహించగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. వస్త్ర వ్యాపారంలో విపరీత ధోరణి ఏర్పడిందని, వ్యాపారం చేయాలంటే పోటీని తట్టుకుంటు ముందుకు వెళ్లాలని సూచించారు. మూడు నెలలుగా శుభకార్యాలు లేక గిరాకీలు లేవన్నారు. పట్టణంలోని 170 బట్టల దుకాణాల యాజమానులు ఒకేతాటిపై ఉండాలని, తన తల్లిదండ్రుల పేరిట కామారెడ్డి బట్టల వర్తక సంఘ భవనానికి విరాళం అందిస్తానన్నారు. స్థానిక ఎమ్మెల్యే సహకారం సైతం తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నూతన అధ్యక్షుడు తాటిపాముల సందీప్, చైర్మన్ గడిల నర్సింలు, ప్రధాన కార్యదర్శి గుజ్జ రాజు, కోశాధికారి మదాసు వెంకటేశం, ఉపాధ్యక్షుడు ఎల్‌వీ ప్రసాద్, పడిగె రాములు, గుర్రపు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వినియోగించని బ్యాలెట్ పత్రాలు వెనక్కి..

- అప్పగించాలని అధికారుల ఆదేశాలు
- త్వరలో నిర్వహించే స్థానిక ఎన్నికల్లో ఎలాంటి లోపాలు తలెత్తకుండా ఉండేందుకు చర్యలు
- ఇప్పటి వరకు 4 మండలాల నుంచి జిల్లా పరిషత్‌కు అప్పగింత

మోర్తాడ్: స్థానిక సంస్థల ఎన్నికల కోసం ముద్రించి వినియోగించని బ్యాలెట్ పత్రాలను జెడ్పీ కార్యాలయానికి స్వాధీనం చేయాలని అధికార యంత్రాంగం నిర్దేశించింది. 2019లో జీపీ, మండల, జిల్లా పరిషత్ ఎన్నికలు జరిగాయి. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు మాత్రమే ఓటింగ్ యంత్రాలను వినియోగిస్తారు. స్థానిక సంస్థల ఎన్నికలకు మాత్రం బ్యాలెట్ పత్రాలనే ఉపయోగించారు. త్వరలో నిర్వహించే స్థానిక ఎన్నికల్లో ఎలాంటి గందరగోళ పరిస్థితికి తావివ్వకుండా ఉండటానికి ముద్రించి వినియోగించని బ్యాలెట్ పత్రాలను స్వాధీనం చేసుకోవాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. దీంతో జిల్లా పరిషత్ సీఈవో ఉషా ఆయా మండల పరిషత్ అభివృద్ధి అధికారులను సోమవారం లోగా వినియోగించని బ్యాలెట్ పత్రాలను అప్పగించాలని ఆదేశించారు. ఇప్పటికే ఎంపీడీవో, కంప్యూటర్ ఆపరేటర్లకు ఓటర్ల జాబితా రూపొందించే విషయంలో శిక్షణ ముగించారు. ఇంతలోనే బ్యాలెట్ పత్రాల స్వాధీనం కోసం ఆదేశాలు ఇచ్చారు. ఇప్పటి వరకు బోధన్, డిచ్‌పల్లి, మెండోరా, ముప్కాల్ మండలాల నుంచి బ్యాలెట్ పత్రాలను అందించారు. మిగిలిన 21 మండలాల నుంచి వినియోగించని బ్యాలెట్ పత్రాలను స్వాధీనం చేయాల్సి ఉంది. ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం ఇంకా నిర్ణయం వెల్లడించకపోయినా అధికారులు చేస్తున్న హడావిడి చూస్తుంటే ఎన్నికల ప్రక్రియ మొదలు కానుందని సంకేతాలు కనిపిస్తున్నాయని చెప్పవచ్చు.

ఆనకట్టపై ఆగని ఆగడాలు



ఆనకట్టపై తాగి పడేసిన బీరు సీసాలు



ప్రాజెక్ట్ నీటి అంచున ఫొటోలు తీసుకుంటున్న యువత

- మద్యం సేవించి ఖాళీ సీసాలు పడేస్తున్న ఆకతాయిలు
- ఇబ్బందిపడుతున్న పర్యాటకులు

బాల్కొండ: ఎస్సారెస్పీపై మద్యం ప్రియుల ఆగడాలు మితిమీరుతున్నాయి. నిత్యం ఆనకట్టపై కూర్చుండి మద్యం సేవిస్తూ సీసాలను పగులగొడుతున్నారు. దీంతో ప్రాజెక్టు సందర్శనకు వచ్చే ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రాజెక్ట్ ఆనకట్ట ముప్కాల్, మెండోరా పీఎస్ పరిధిలో ఉంటుంది. ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ నిలిచే ప్రాంతం బాల్కొండ పీఎస్ పరిధిలోకి వస్తుంది. మూడు పోలీసు స్టేషన్లు ఉన్నాయి. కానీ ఏ పోలీస్ స్టేషన్ భద్రత ఎస్సారెస్పీకి లేదు. దీంతో ఆకతాయిల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. ఆనకట్టపై నిత్యం రాత్రిళ్లు మద్యం సేవిస్తూ అసాంఘిక కార్యకలాపాలు సాగిస్తున్నారు. ఆనకట్టపై నిఘా ఉంచి తగు చర్యలు తీసుకోవాలని పర్యాటకులు, ప్రజలు కోరతున్నారు.

ఆత్మహత్యలు చేసుకోవడానికి..

ఎస్సారెస్పీ ఆనకట్టపై ఎవరి పర్యవేక్షణ లేకపోవడంతో ప్రాజెక్ట్‌లో ఆత్మహత్యలు చేసుకోడానికి పలువురు యత్నిస్తున్నారు. శుక్రవారం ఆర్మూర్ మండలం కోటార్మూర్‌కు చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్య యత్నం చేయగా ముప్కాల్ పోలీసులకు సమాచార అందడంతో కాపాడారు. కానీ అదే కాపలా ఆనకట్టపై ఉంటే ఇలాంటి పరిస్థితి ఉండేది కాదని పలువురు పేర్కొంటున్నారు. గతంలో సబ్ కంట్రోల్ బూత్ ర్పాటు చేశారు. కానీ దానిని మధ్యలోనే ఎత్తివేశారు. ప్రాజెక్ట్‌పై పోలీస్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

ఆగని ఫొటో షూట్..

ఎస్సారెస్పీలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నా ఫొటో షూట్ మాత్రం ఆగడం లేదు. వివాహాలు చేసుకునే వారు ప్రీవెడ్డింగ్ పేరుతో ఫొటో షూట్‌కు వస్తున్నారు. కానీ వారికి ఎక్కడ లోతు ఉంటుంది, ఎక్కడ ఫొటో షూట్ చేసుకోవాలని గైడ్‌చేసే వారు లేరు. దీంతో వారికి నచ్చిన ప్రాంతాల్లో ఫొటో షూట్ చేసుకుంటున్నారు. గతంలో జరిగిన ప్రమదాలను దృష్టిలో ఉంచుకుని ప్రాజెక్ట్ అధికారులు ఫొటో షూట్‌ను నిషేదించారు. కానీ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు.

క్షణికావేశంలో కెనాల్‌లో దూకి ఆత్మహత్య



సాగర్ (ఫైల్)

మోపాల్: మండలంలోని సిర్‌పూర్‌కు చెందిన తెడ్డు సాగర్ (26) న్యాల్‌కల్‌లో ఉన్న నిజాంసాగర్ కెనాల్‌లో క్షణికావేశంలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై గంగాధర్ శనివారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన తెడ్డు సాగర్, ఆయన భార్య చందన జిల్లాకేంద్రంలో కూలీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి 11 నెలల క్రితం వివాహమైంది. సాగర్ గతంలో గల్ఫ్ వెళ్లి తిరిగి రావడంతో అప్పులయ్యాయి. ఈవిషయమై కొంతకాలంగా భార్యభర్తల మధ్య గొడవలు జరు గుతున్నాయి. ఇదేక్రమంలో శనివారం ఉదయం పని చేసేందుకు నిజామాబాద్‌కు బైక్‌పై వెళ్తుండగా, మాటామాటా పెరిగింది. దీంతో సాగర్ వాహనం ఆపడంతో భార్య దిగి నడుచుకుంటూ వెళ్లింది. క్షణికావేశానికి గురైన సాగర్ పక్కనే ఉన్న నిజాంసాగర్ కెనాల్‌లో దూకాడు. ఈత రాకపోవడంతో నీట మునిగి మరణించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు గజ ఈతగాళ్ల సాయంతో గాలించి మృతదేహాన్ని బయటకు తీయించారు. పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. భార్య చందన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పోలీసులను దూషించిన యువకుడి రిమాండ్



మాట్లాడుతున్న ఎస్సై ఆంజనేయులు

గాంధారి: పోలీసులను దూషించిన ఓ యువకుడిని రిమాండ్ చేసినట్లు ఎస్సై ఆంజనేయులు శనివారం పేర్కొన్నారు. వివరాలిలా ఉన్నాయి. శుక్రవారం రాత్రి మండల పరిధిలోని కాటేవాడి తండాకు చెందిన బానోత్ రాజేశ్ అనే యువకుడు మండల పరిషత్ కార్యాలయ సమీపంలో బైక్‌ను అతివేగంగా నడుపగా పెద్ద గుజ్జుల్ తండాకు చెందిన కన్నెరామ్ రాత్రి పూట అంతవేగం ఎందుకు నెమ్మదిగా వెళ్లాలని సూచించాడు. దీంతో నాకే మెల్లిగా వెళ్లాలని చెబుతావా అంటూ దాడి చేసి అతని బైక్‌ను ధ్వంసం చేశాడు. కన్నెరామ్ స్థానిక పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. ఆయన వెనుకనే రాజేశ్ పీఎస్‌కు వచ్చి పోలీసులను దూషిస్తూ టేబుల్‌పై ఉన్న ఫైళ్లను, వస్తువులను చిందర వందర చేశాడు. వారించిన పోలీసులను నెట్టేసి హల్‌చల్ చేశాడు. రాజేశ్ నెట్టివేయడంతో ఏఎస్సై గంగారాం కిందపడిపోయాడు. ఏఎస్సై ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రిమాండ్ చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

మాక్లూర్: మండలంలోని దాస్‌నగర్ శివారులో కొనసాగుతున్న పేకాట స్థావరంపై దాడి చేసినట్లు ఇన్‌చార్జి ఎస్సై లక్ష్మణ్ శనివారం పేర్కొన్నారు. ఈ దాడిలో ఆరుగురిని అరెస్టు చేయగా వారి నుంచి రూ. 3,740 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా పేకాట ఆడితే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో రైతు మృతి



చిరంజీవులు(ఫైల్)

ఎల్లారెడ్డి: ట్రాన్స్‌ఫార్మర్ ఆఫ్ చేసేందుకు వెళ్లిన ఓ రైతుకు విద్యుదాఘాతం సంభవించి మృతి చెందిన ఘటన మండలంలోని లింగారెడ్డిపేటలో శనివారం చోటు చేసుకుంది. ఎస్సై మహేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మామిడి చిరంజీవులు (54) ఉదయం తన పొలం పనులకు భార్యతో కలిసి వెళ్లాడు. నీరు తాగేందుకని బోరు ఆన్ చేయగా మోటార్ స్టాటర్ బాక్స్ వైర్లు తెగి ఉండటాన్ని గమనించాడు. వాటిని సరిచేసేందుకు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆఫ్ చేసి మరమ్మతులు చేసేందుకు యత్నించాడు. దగ్గరలో ఉన్న జంపర్ హ్యాండిల్‌ను పట్టుకోగా విద్యుదాఘాతం సంభవించి చిరంజీవులు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య సంగీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

లారీని బైక్ ఢీకొన్న ఘటనలో మరొకరు..

ఖలీల్‌వాడి: ఆగిఉన్న లారీని ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందినట్లు మూడో టౌన్ ఎస్సై ప్రవీణ్ శనివారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. నిజాంకాలనీకి చెందిన అన్వర్(42) బైక్‌పై కూరగాయల మార్కెట్‌కు వస్తుండగా ఆ ప్రాంతంలో ఉన్న ఆగి ఉన్న లారీని ఢీకొన్నాడు. ఈ ఘటనలో అన్వర్‌కు తీవ్రగాయాలు కాగా అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

శతాధిక వృద్ధుడి మృతి



బద్ధి సాయన్న(ఫైల్)

మాక్లూర్: మండలంలోని వల్లభాపూర్‌లో శతాధిక వృద్ధుడు బద్ధి సాయన్న (105) శనివారం తన స్వగృహంలో మృతి చెందాడు. ఆయనకు కుమారుడు గంగాధర్ ఎక్సైజ్ కానిస్టేబుల్‌గా రిటైర్డ్ అయ్యారు. ఐదుగురు కుమార్తెలు ఉండగా ఇద్దరు కుమార్తెలు మృతి చెందారు. కాగా మనుమళ్లు, మనుమరాళ్లు మొత్తం కలిపి 15 మంది ఉండగా 25మంది ముని మనుమళ్లు మనుమరాళ్లు ఉన్నారు. వల్లభాపూర్‌లో ఒక తరం వృద్ధులందరూ ఎప్పుడో మృతి చెందగా తాజాగా బద్ధి సాయన్న మృతితో నాటి తరానికి చెందిన వృద్ధులెవ్వరూ గ్రామంలో లేనట్టు గ్రామస్తులు తెలిపారు. కుమారుడు గంగాధర్, మనువళ్లు, మనుమరాళ్లు అంత్యక్రియలు చేపట్టారు.

మాచారెడ్డిలో సైబర్ మోసం

మాచారెడ్డి: మండలంలోని కాకుల గుట్ట తండాకు చెందిన భూక్య సంతోష్ సైబర్ మోసానికి గురైనట్లు ఎస్సై అనిల్ శనివారం తెలిపారు. గ్రామానికి చెందిన సంతోష్ నర్సింగ్ అధికారిగా పనిచేస్తున్నాడు. సైబర్ నేరగాళ్లు ఈ నెల 8న సంతోష్‌కు ఫోన్ చేసి తాము ఆర్బీఐ బ్యాంక్ నుంచి మాట్లాడుతున్నామని, ఆర్బీఐ క్రెడిట్ కార్డు వార్షిక చార్జ్ యాక్టివేషన్‌లో ఉందని దానిని ఆక్టివేషన్ చేయాలని చెప్పి నమ్మించారు. వాట్సాప్ ద్వారా వారు పంపిన ఆర్బీఐ క్రెడిట్ కార్డ్ ఏపీకే ఫైల్‌ను ఓపెన్ చేశాడు. దీంతో అతని ఎస్బీఐ క్రెడిట్ కార్డు నుంచి రూ. 67,700 నగదు విత్ డ్రా అయింది. మోసాన్ని గుర్తించిన అతను వెంటనే 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన్నట్లు ఎస్సై పేర్కొన్నారు.